కూటమిపై ప్రజలకు విరక్తి


అంగరలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్న జనం
- అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలం
- ప్రజలతో మమేకం కావాలని కార్యకర్తలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దిశానిర్దేశం

కపిలేశ్వరపురం: ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం మెజారిటీ ప్రజలకు దూరమైందని, సామాన్య ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంగరలోని పార్టీ మండల కార్యాలయంలో శుక్రవారం మండలంలోని గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జూన్ 4న కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 'వెన్నుపోటు దినం'గా పాటించాలంటూ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, నాయకులు గూటం సత్యనారాయణ, మేడిశెట్టి దుర్గారావు, తిరునాతి వెంకటేశ్వరరావు హాజరైన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తోట పలు అంశాలపై చర్చించారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగు సమయానికి ముందస్తుగానే పెట్టుబడి సాయాన్ని అందించిందన్నారు. ఏ పంటకు నష్టం వాటిల్లితే ఆ పంటకు పరిహారం అందే విధానాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఏడాది కూటమి పాలనలో రైతులను గాలికి వదిలేశారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాంకేతికంగా ఓడిపోయినప్పటికీ ప్రజల గుండెల్లో కొలువై ఉందన్నారు. ఇప్పటికీ గ్రామాల్లోని సామాన్యుల ఇంటికెళ్లి జగన్ పాలనా కాలంలో ఈ మేలు చేశామని చెప్పే దమ్ము, ధైర్యం వైఎస్సార్ సీపీ కార్యకర్తలకే ఉందన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి అందించడమే ఆ ధైర్యానికి కారణమన్నారు. ఏడాది సాగిన పాలనలో ఏ కూటమి నాయకుడైనా సామాన్యుల ఇంటికెళ్లి కూటమి ప్రభుత్వంలో ఈ మేలు చేశామని చెప్పుకునే ధైర్యం లేదన్నారు. మద్యం వినియోగాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలను తీసుకుందన్నారు. మద్యం షాపులను గణనీయంగా తగ్గించడంతో పాటు, ఊరు చివర మాత్రమే దుకాణాన్ని నిర్వహించేవారన్నారు. కూటమి పాలనలో బడి, గుడుల వద్దనే కాకుండా, మహిళా సమూహాలున్న చోట సైతం మద్యం షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారన్నారు. పేదల ఆర్థిక బలహీనతను ఆసరాగా తీసుకుని ఎన్నికల్లో మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని మండిపడ్డారు.

రైతన్నల జీవితం గందరగోళం

రెండు పంటలు పూర్తయినా అన్నదాత సుఖీభవ సాయం అందలేదని, ఒక విద్యా సంవత్సరం గడిచినా తల్లికి వందనం సాయం విద్యార్థుల తల్లులకు ఇవ్వలేదని ఎమ్మెల్సీ తోట విమర్శించారు. గెలిచేందుకు ఇబ్బడిముబ్బడిగా ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చిన కూటమి నేతలు, గెలిచాక ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని, ఎలా ముందుకు వెళ్లాలో తెలియడం లేదనడం వారి నిబద్ధతలేమికి నిదర్శనమన్నారు. మూడుసార్లు సీఎంగా చేశానని, సంపద సృష్టించడం తన ప్రత్యేకత అని చెప్పుకొచ్చిన సీఎం చంద్రబాబు ఏడాది కాలంలోనే పరిమితికి మించి అప్పులు తెచ్చారన్నారు. వైఎస్ జగన్ హయాంలో అప్పులు నేరుగా సామన్య ప్రజలకు బటన్ నొక్కడం ద్వారా చేరాయని, ఏడాది కాలంలో చంద్రబాబు రూ. 1.60 లక్షల కోట్లు తెచ్చిన అప్పు ఎక్కడకు మళ్లిందని ప్రశ్నించారు. సామాన్య ప్రజలకు ఏడాదిలోనే కూటమి పాలనా తీరు అర్థమైందని, తప్పు చేశామన్న భావనలో ప్రజలు ఉన్నారన్నారు. సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా భరోసాగా నిలవాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలతో మమేకం కావాలన్నారు. అందులో భాగంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిరిపురపు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, కుక్కల వీరన్న, నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, పెద్దింశెట్టి రామస్వామి, అశిరమూర్తి, శ్రీను, కిశోర్, శ్రీనివాస్, మురళి, నూకరాజు, గణేష్, కొండేటి వెంకటేశ్వరరావు, సలాది వీరబాబు, వాసంశెట్టి విష్ణు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్. చిత్రంలో హాజరైన పార్టీ శ్రేణులు

రామచంద్రపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ప్రజలకు చేసిన మోసాలపై జూన్ 4న వెన్నుపోటు దినంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపుమేరకు.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ కార్యకర్తలకు నిర్దేశించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. వెన్నుపోటు దినం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ గతేడాది కాలంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందన్నారు. గతంలో మాదిరిగానే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న జరిగే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి, ప్రజలను కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాలని కోరారు. ఎంపీపీ అంబటి భవాని, పంపన నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టి నిరసన


మున్సిపల్ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పురపాలక సంఘం అవుట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం ఏడో రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని దీర్ఘకాలంగా పలు పద్ధతుల్లో నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని నాయకులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ మేరకు యూనియన్ నాయకులు మాట్లాడుతూ, నిత్యం ప్రజలతో మమేకమవుతున్న తమ న్యాయమైన డిమాండ్లను పరిశీలించకపోవడం సరైందికాదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పాలపర్తి సుబ్బరాజు, సంతోష్, రమేష్, వెంకన్న, ప్రవీణ్, నవీన్ కుమార్, వాసు, సురేంద్ర, అన్నవరం, గన్నియ్య తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు మద్దతు

15 సంవత్సరాల సర్వీసు ఉన్న తమను శాశ్వత ఉద్యోగులుగా చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు పోస్టల్ ఉద్యోగులు మద్దతు పలికారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరాన్ని సందర్శించి శుక్రవారం తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. పోస్టల్ క్లాస్–3 ఉద్యోగ సంఘాల నాయకులు కేవీ నారాయణరావు, కొండపల్లి సూర్యనారాయణ, పోస్ట్‌మన్ ఉద్యోగుల సంఘం నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి ఎండీఎం షరీఫ్, పోస్టల్ పెన్షనర్ల ఉద్యోగుల సంఘం నాయకుడు టపా పుల్లేశ్వరరావు తదితరులు ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణపై నిర్లక్ష్యం

- కౌన్సిల్ సమావేశంలో కో–ఆప్షన్ సభ్యుడు రాజుబాబు ఆగ్రహం
- మొత్తం 60 అంశాలపై తీర్మానాలు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కౌన్సిల్ సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో వాటర్ వర్క్స్‌కు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి గోడ నిర్మాణం చేయడంపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కౌన్సిల్ కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజుబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది.

60 అంశాలతో అజెండా

కమిషనర్ టీవీ రంగారావు 60 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టగా, అందులో 59 ప్రతిపాదనలను యథావిధిగానూ, ఒక అంశానికి సవరణ చేసి ఆమోదించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. అంశాలు వారీగా చైర్‌పర్సన్ నూకదుర్గారాణి చర్చను చేపట్టారు. పట్టణంలోని పారిశుద్ధ్యం, ఆక్రమణలు, నీటి సరఫరా తదితర అంశాలపై కౌన్సిలర్లు చర్చించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా మంచి నీటి సరఫరా అభివృద్ధి ప్రాజెక్టులో ఏటా మున్సిపాలిటీ నిర్వహణ కోసం రూ.7.79 కోట్లు వెచ్చించడం అదనపు భారంగా మారుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.

ఆక్రమణపై ఆగ్రహం

పట్టణంలోని వాటర్ వర్క్స్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి ఆక్రమించి గోడను నిర్మించడంపై అధికారుల వైఖరి ఏమిటంటూ పిల్లి శ్రీనివాస్ ప్రస్తావించగా, కో–ఆప్షన్ సభ్యుడు రాజుబాబు అదే అంశంపై కమిషనర్ రంగారావు తీరును నిలదీశారు. గోడ నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గత రెండు సమావేశాల్లో గట్టిగా చెప్పిన విషయాన్ని పట్టించుకోరా అంటూ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ వివరణ ఇస్తూ, దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారన్నారు. పట్టణంలో మున్సిపల్ స్థలాలను ఆక్రమించిన పెద్దలు.. సాంకేతిక అంశాలను ఆసరాగా తీసుకొని కోర్టుకు ఆశ్రయించడానికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. మున్సిపల్ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ కమిషనర్‌ను నిలదీశారు. గత సమావేశంలో ఇదే అంశంపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోమని చెప్పామన్నారు. సామాన్య ప్రజలకు చిన్నపాటి సాంకేతిక సమస్య వచ్చినా అధికారులు వారిని పీడిస్తుంటారని, అదే ఆక్రమణదారులకు తప్పించుకునేందుకు అన్ని విధాలా అవకాశాలిస్తున్నారని రాజుబాబు మండిపడ్డారు. సమావేశంలో కౌన్సిలర్లు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆగేరు.. డేంజరే..!

- ఏటిగట్టుపై కళ్లెం లేని ఇసుక లారీల రాకపోకలు
- బెంబేలెత్తుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డ్రైవర్లు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని యంత్రాంగం


కూళ్ల ఏటిగట్టుపై ఇటీవల ఇసుక లారీని అడ్డుకున్న గ్రామస్తులు

కె.గంగవరం: ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. వారం రోజులుగా రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. అధికారుల ఉదాసీనత వల్ల ఇసుల లారీల స్పీడుకు బ్రేకులు పడడం లేదు. దీంతో సాధారణ ప్రయాణికులు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలు కావడం, కొందరు మృత్యువాత పడుతున్న సంఘటనలూ చోటుచేసుకుంటున్నాయి. కోరుమిల్లి, కపిలేశ్వరపురం తదితర ఇసుక ర్యాంపుల నుంచి ప్రతి రోజూ పదుల సంఖ్యలో లారీలు కె.గంగవరం మండలం మీదుగా రేయింబవళ్లు తేడా లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాయి. కపిలేశ్వరపురం మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి ఇసుకను నేరుగా ఏటిగట్టుపై కూళ్ల, పామర్రు మీదుగా కె.గంగవరం, ద్రాక్షారామ మీదుగా తరలిస్తున్నారు. ఈ లారీల స్పీడుకు బెంబేలెత్తి.. ద్విచక్ర వాహనదారులే రోడ్డు పక్కన ఆగిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. **దీనికితోడు రహదారికి ఇరువైపులా అప్రోచ్‌లు లేకపోవడం వల్ల ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.**

తరచూ ప్రమాదాలు

గతంలో కోటిపల్లిలో ఓ బాలుడు ఇసుక లారీ కిందపడి మృతిచెందాడు. కె.గంగవరంలో ఇసుక లారీ స్పీడుగా వచ్చి ఓ హోటల్‌లో దూసుకెళ్లడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. గత నెలలో పామర్రు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కూళ్ల వంతెన వద్ద మోటారు సైకిల్‌పై వెళుతుండగా.. ఇసుక లారీ ఢీకొని తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. అముజూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇంట్లోకి ఓ ఇసుక లారీ దూసుకుపోయింది. దీంతో పాటు నిత్యం పలు ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక లారీల స్పీడుకు బ్రేకులు వేయాలని వారు కోరుతున్నారు.

భారీగా ఇసుక తరలింపు

ప్రతి రోజు ఇసుకను లారీలు, ట్రాక్టర్ల సహాయంతో భారీగా తరలిస్తున్నారు. గోదావరి గట్టున అనుమతి లేని పలు ర్యాంపుల నుంచి ఇసుకను ప్రతి రోజు దాదాపు 300 లారీల ఇసుకను అక్రమంగా తరలించి, రాత్రికిరాత్రే రహస్యంగా నిల్వ చేస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు నియోజకవర్గంలోని రామచంద్రపురం, ద్రాక్షారామ, కాజులూరు తదితర ప్రాంతాల్లో ఇసుకను భారీగా నిల్వ చేస్తున్నట్లు కొందరు లారీ డ్రైవర్లు చెబుతున్నారు.

భయాందోళనకు గురి చేస్తున్నాయి



ఏటిగట్టుపై ప్రయాణిస్తున్న ఇసుక లారీలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. పరిమితికి మించి ఇసుక లోడుతో అధిక వేగంగా గ్రామీణ ప్రాంత రోడ్లపై ప్రయాణిస్తున్నాయి. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పెంకే రవిచంద్ర, పామర్రు

వేగాన్ని తగ్గించడం లేదు



ఇసుక లోడుతో వెళుతున్న లారీలు కనీసం గ్రామాల్లో కూడా స్పీడు తగ్గించడం లేదు. రోడ్డుపై జన సంచారం ఉన్నా సరే డ్రైవర్లు మరింత స్పీడుగా నడుపుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంటోంది.

– అడపా నారాయణస్వామి, సుందరపల్లి

క్లుప్తంగా

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

తహసీల్దార్ ఠాగూర్


కుయ్యేరులో రేషన్ షాపు తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కాజులూరు: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో జరిగే రేషన్ బియ్యం పంపిణీలో నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుయ్యేరు, కాజులూరు, దుగ్గుదుర్రు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. పలు రేషన్ షాపులు తనిఖీలు చేసి, రేషన్ పంపిణీపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ ఒకటి నుంచి రేషన్ షాపులలో ప్రభుత్వ చౌక బియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. వృద్ధులకు, అంధులకు రేషన్ సరకులు వారి ఇళ్లకు చేరవేసే బాధ్యత రేషన్ షాపు డీలర్లదేనన్నారు. ప్రతి నెలా ఒకటి నుంచి 15 వరకు రేషన్ షాపు తెరిచే ఉండాలన్నారు. ఆదివారం కూడా చౌక దుకాణం తెరిచి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎవరైనా రేషన్ సరకులు వద్దనుకుంటే వివరాలు సేకరించాలన్నారు. కార్డుదారులకు రేషన్ అందకపోయినా, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.వేగేశ్వరరావు, ఎంఎస్‌వో అనిల్, పలువురు రేషన్ డీలర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆరోగ్యానికి యోగా ఆసరా


యోగాభ్యాసం చేస్తున్న ఉద్యోగులు, ప్రజలు

కపిలేశ్వరపురం (మండపేట): ఆరోగ్యానికి యోగా ఆసరాగా ఉపకరిస్తుందని మండపేటలో శుక్రవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండపేట పట్టణంలోని బాబు అండ్ బాబు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఒక రోజు యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని సత్యసాయి ధ్యాన మండలి యోగా గురువు రఘు, సహాయకుడు తిరుపతిరాజు శిక్షణ ఇచ్చారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మాజీ చైర్మన్ చుండ్రు వర ప్రకాష్, కమిషనర్ రంగారావు యోగాభ్యాసం చేశారు. ఈ మేరకు యోగా గురువులను ప్రముఖులు ఘనంగా సత్కరించారు. అనంతరం యోగా గురువులు మాట్లాడుతూ, ఆధునిక కాలంలో మారిన జీవన స్థితిగతులతో వ్యక్తుల మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. పరిపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు యోగాసనాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలు


మాచవరంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న వర్కర్లు

రాయవరం: మండలంలోని వెదురుపాక, మాచవరం గ్రామాల్లో శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. 1970లో సీఐటీయూ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కార్మిక, కర్షక సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ.. ఐక్యతా పోరాట నినాదంతో విడివిడిగా ఉన్న కార్మికులందరినీ ఒక సంఘంగా నడిపిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు బ్రిటిష్ కాలంలో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ, కార్మిక వర్గ శ్రమను పెట్టుబడిదారీ వర్గానికి ధారాదత్తం చేస్తూ నిర్ణయాలు చేస్తున్నాయన్నారు. లేబర్ కోడ్‌లను తిప్పికొట్టడం కోసం జూలై 9వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా సీఐటీయూ ముఖ్యమైన పాత్రను పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవేణి, శ్రీసత్య, కమల, వెంకటలక్ష్మి, పుష్ప, ఆశా వర్కర్లు దుర్గ, అనంతలక్ష్మి, మిడ్ డే మీల్స్ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు వనువులమ్మ జాతర

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ దేవత వనువులమ్మ జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద శనివారం జాతర, ఆదివారం తీర్థం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అమ్మవారిని ఆసాదులు విశేషంగా అలంకరించారు. పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

సప్తాహ కార్యక్రమానికి రాట ముహూర్తం


రాట ముహూర్తంలో పాల్గొన్న పెద్దలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద జూన్ 2 నుంచి జూలై 21 వరకు నిర్వహించే శ్రీరామ నామ సప్త సప్తాహ మహోత్సవానికి శుక్రవారం రాట ముహూర్తం నిర్వహించారు. ఈ సప్తాహాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిస్తారని, భజన కార్యక్రమాలను రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రారంభిస్తారని ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం సభ్యులు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పేరెన్నికగన్న భజన బృందాలు ఈ సప్తాహంలో పాల్గొంటాయని వివరించారు. సప్తాహం ముగింపు సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులతో పూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

3న మండల పరిషత్ సమావేశం

కపిలేశ్వరపురం: మండపేట మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని జూన్ 3వ తేదీన మధ్యాహ్నం 2.గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2న నిర్వహించాల్సిన సమావేశాన్ని అనివార్య కారణాలతో 3వ తేదీకి మార్చినట్టు తెలిపారు. మండల సమావేశ మందిరంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీఓ ఆదేశించారు.

అహల్యాబాయి సేవలు అజరామరం

కపిలేశ్వరపురం (మండపేట): అహల్యాబాయి సేవలు అజరామరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. మండపేట కామాక్షి కల్యాణ మండపంలో శుక్రవారం అహల్యాబాయి జయంతి నిర్వహించారు. కార్యక్రమ ఇన్‌చార్జి కొత్తపల్లి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వేటుకూరి సూర్యనారాయణరాజు, తూర్పు కాపు సంఘం డైరెక్టర్ గడి సత్యవతి, బీజేపీ జిల్లా నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీవేమా, జిల్లా ఇన్‌చార్జి పాట్నూరి రామ్మోహనరావు, పాలూరి సత్యానందం, కోన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రతిపాదనలపై అభ్యంతరం

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పట్టణంలోని శివాలయం పార్కు సమీపంలో సీఎస్సార్ నిధులతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవటంతో కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షత వహించారు. సమావేశంలోని ఐదో అంశంపై కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ, 23వ వార్డులో రైతు బజార్ నిర్మించిన ప్రాంతంలో పిరమిడ్ ధ్యాన కేంద్రం, ఓపెన్ ఎయిర్ జిమ్, నెట్ క్రికెట్, వాకింగ్ ట్రాక్, మహిళలు వ్యాపారాలు చేసేందుకు షాపింగ్ కేంద్రాల నిర్మాణానికి మంత్రి సుభాష్ రూ.1.50 కోట్లు సీఎస్సార్ నిధులతో చేపట్టేందుకు ప్రతిపాదించారని తెలిపారు. దీనిపై వైస్ చైర్‌పర్సన్ కె.శివాజీ, కౌన్సిలర్లు పెంటపాటి దేవి, గుబ్బల గణ తదితరులు మాట్లాడుతూ, చెరువు ప్రాంతమైన ఆ ప్రదేశంలో కట్టడాలకు అనుమతులు రావాలని అభ్యంతరం తెలిపారు. దీనిపై కమిషనర్ జోక్యం చేసుకుని.. కలెక్టర్‌తో అనుమతులు తీసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో అనుమతులు తీసుకున్నాకే కౌన్సిల్ సభ్యులు ఆమోదిస్తామని చెప్పటంతో ప్రతిపక్ష, అధికార పక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. దీంతో ఆ అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు.